నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం | జులై 06, 2024 | www.navatelangana.com

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

- డీఆర్‌డీవో పీడీ చందర్

నవతెలంగాణ-సదాశివనగర్


మొక్కలు నాటుతున్న పీడీ

మండలంలోని తిమ్మోజివాడి గ్రామంలో శనివారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి చందర్ పాల్గొని మొక్కలు నాటారు. అన్ని గ్రామ పంచాయతీ లో ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయలని సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. అనంతరం ఇంటి వద్ద మొక్కలు నాటలని పంపిణీ చేశారు. ఎంపిడిఓ సంతోష్ కుమార్, ఎంపిఓ సురేందర్, ఏపీవో మధు కార్యదర్శులు శ్రీలేఖ, జగన్ శాలు తదితరులు పాల్గొన్నారు.

బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు సన్మానం

నవతెలంగాణ-ఆలూర్(ఆర్మూర్)



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆలూర్ విద్యార్థులు 12 మంది బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపికైన సందర్భంగా శనివారం గ్రామ తాజా మాజీ సర్పంచ్ కళ్లెం మోహన్‌రెడ్డి అభినందన సభ నిర్వహించారు. మాజీ సర్పంచ్ సంతోష్‌రెడ్డి పాఠశాల అభివృద్ధికై రూ.1,50,000, 10/10 సాధించిన వారికి ట్రిబుల్ ఐటీ సాధించిన విద్యార్థులకు ఆగస్టు 15 రోజున నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. భవజ్ఞ, రశ్మిత, శరణ్య, సవిత, దేవానంద్, సదానంద్, చాముండేశ్వరి, సంజన, దీక్షిత, అర్చన, కావ్య, శ్రీ మధు అనే విద్యార్థులు ఎంపిక కాగా వీరిని సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.నరేందర్, మాజీ సర్పంచ్, దుమ్మాజీ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మల్లేష్, అన్నపూర్ణ ట్రస్ట్ ఆర్మూర్ అధ్యక్షులు రాజన్న, పిఆర్‌టియు ఆలూర్ మండల అధ్యక్షులు అశ్ఫక్ అహ్మద్, పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి సుజోయ్ పాల్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- హైకోర్టు జడ్జి సుజోయ్ పాల్ హితవు
- న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

నవతెలంగాణ-కంఠేశ్వర్

భవిష్యత్తును అంధకారంగా మారుస్తూ జీవితాన్ని నాశనం చేసే మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని రాష్ట్ర హైకోర్టు జడ్జి, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సుజోయ్‌పాల్ హితవు చేశారు. ప్రత్యేకించి ఉజ్వల భవిత కలిగిన విద్యార్థులు మత్తు పదార్థాల వైపు మళ్లకుండా, తమ లక్ష్యం దిశగా అకుంఠిత దీక్షతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. శనివారం నిజామాబాద్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ సుజోయ్ పాల్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, హైకోర్టు జడ్జి శ్రీసుధ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరీ, జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో హైదరాబాద్ జోనల్ డైరెక్టర్ సచిన్ గోర్పడే, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ విచ్చేశారు.

ఈ సందర్భంగా జస్టిస్ సుజోయ్ పాల్ మాట్లాడుతూ.. తాము చదువుకునే రోజుల్లో విద్యార్థుల ఆత్మహత్యలు ఉండేవి కావని, డ్రగ్స్ అనే పదమే వినిపించేది కాదన్నారు. కానీ నేడు అనేకమంది విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటుపడి మానసిక కుంగుబాటుకు లోనవుతూ బలవన్మరణాలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగించే అంశంగా మారిందన్నారు. అందుబాటులోకి వచ్చిన అధునాతన సాంకేతికత, సమాచార విప్లవంతో విజ్ఞాన పరమైన అనేక అంశాలను తెలుసుకునే వెసులుబాటు ఏర్పడిందని, అదే సమయంలో యువత, విద్యార్థులు పెడద్రోవ పట్టేందుకు కూడా ఇవి కారణభూతంగా నిలుస్తున్నాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థి దశ నుండే క్రీడలు, వ్యాయామాలు వంటివి ఆచరిస్తే, గెలుపోటములను సమానంగా స్వీకరించే మానసిక స్థైర్యం అలవడుతుందని అన్నారు. వివిధ రంగాలలో ఉన్నత స్థానాలకు చేరిన వారిని స్ఫూర్తిగా తీసుకుంటూ, మన లోపాలను సరిదిద్దుకుని ముందుకెళ్తే తప్పనిసరిగా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని హితబోధ చేశారు.

హైకోర్టు జడ్జి పి.శ్రీసుధ మాట్లాడుతూ.. బాధ్యతల భారం తెలియని నేటి తరం పిల్లలు, చిన్నచిన్న కారణాలకే మానసిక సమతుల్యాన్ని కోల్పోతున్నారని, అలాంటి వారు ఎంతో సులభంగా డ్రగ్స్ వైపు మొగ్గుచూపుతూ వాటికి బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, తమను తాము పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, వాటికి దూరంగా ఉండేందుకు అనుసరించాల్సిన పద్ధతులు, డ్రగ్స్ వినియోగం, వాటిని కలిగి ఉండడం వల్ల ఎదుర్కోవాల్సి వచ్చే శిక్షలు తదితర అంశాల గురించి నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో హైదరాబాద్ జోనల్ డైరెక్టర్ సచిన్ గోర్పడే పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సవివరంగా తెలియజేశారు. సదస్సులో న్యాయాధి కారులు, వివిధ పాఠశాల, కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

- ముందస్తు జాగ్రత్తలతో వ్యాధుల వ్యాప్తి అరికట్టొచ్చు
- మారుమూల ప్రాంతవాసులకు సైతం ప్రభుత్వ వైద్యసాయం అందాలి
- రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆర్.వి. కర్ణన్
- ఇరు జిల్లా కేంద్రాల ఆస్పత్రులు సందర్శన, వివిధ శాఖల అధికారులతో సమీక్ష


కామారెడ్డి ఆస్పత్రిని తనిఖీ చేసి రోగులతో మాట్లాడుతున్న కర్ణన్

నవతెలంగాణ-కామారెడ్డి/కంఠేశ్వర్

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా కట్టుదిట్టంగా వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆర్వి కర్ణన్ ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. శనివారం ఆయన కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని డయాలసిస్, ఆపరేషన్ థియేటర్, పాలియేటివ్ కేర్ సెంటర్ , శస్త్ర చికిత్స వార్డ్, ఎమర్జెన్సీ వార్డ్ రక్త నిధి కేంద్రం, సెంట్రల్ ల్యాబ్, స్కానింగ్ కేంద్రం, ఆర్టీసీ ఆర్ కేంద్రం లను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసదుపాయలపై వాకబు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం అయినందున సీజనల్ వ్యాధులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నదని ఆసుపత్రికి జ్వరాలతో వచ్చే ప్రతి ఒక్కరికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి డెంగ్యూ, మలేరియా, డయేరియా లాంటి వ్యాధులు వ్యాపించకుండా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదమని, ఆస్పత్రిలో అన్ని రకాల ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకొని సుదూర ప్రాంతాల నుండి వివిధ రకాల వైద్య సేవలకు వచ్చే ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ఆసుపత్రిలో సదుపాయాలు, రోగి సహాయకుల కోసం మౌలిక వసతులను హాస్పిటల్ పర్యవేక్షకులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలకు సైతం ప్రభుత్వ వైద్య సేవలు అందించాలని కమిషనర్ వైద్యులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ హాస్పిటల్‌కు ధీటుగా వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు కృషి చేయాలని అన్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుండి వైద్యసేవలకు వచ్చే ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నామని, వైద్య సేవలకు ప్రజలు ప్రయివేటు హాస్పిటల్‌కు వెళ్లకుండా చూడాలని, గర్భిణీ స్త్రీలకు అవసరమైన అన్ని రకాల స్కానింగ్‌లను నిర్వహించి ఆన్‌లైన్‌లో రిపోర్ట్ అందించాలని వైద్యా ధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భం గా టి దయాగ్నస్టిక్ హబ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చంద్రశేఖర్, డిసిహెచ్ఎస్ విజయలక్ష్మి, ఆసుపత్రి సూపరింటిండెంట్ బన్సీలాల్, ఆస్పత్రి ఆర్ఎంఒలు శ్రీనివాస్, సుజాత, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పూర్తిసన్నద్ధతతో ఉండాలి

అనంతరం ఇరు జిల్లాల్లోని కలెక్టరేట్‌లలో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా పంచాయతీ రాజ్ శాఖ , జిల్లా సంక్షేమ అధికారి (మహిళ , శిశు సంక్షేమ , వికలాంగుల శాఖ) జిల్లాలోని మున్సిపల్ శాఖ అధికారులు , జిల్లా స్థాయిలో వైద్యాధికారులు, జిల్లా ఆసుపత్రికి అధికారులు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డెంగ్యూ , మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, తగు ముందు జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలి ఆదేశించారు. గ్రామీణ స్థాయి నుండి జిల్లా స్థాయి అధికారులు ఇట్టి విషయంలో పూర్తి సన్నద్ధతతో ఉండాలని సూచించారు. తగిన ముందు జాగ్రత్త చర్యలతో ఇట్టి వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు.. డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలినప్పుడు చేపట్టవలసిన కార్యాచరణ ఎస్.ఓ.పి. పై వివరించారు. డయేరియా (అతిసార) వ్యాధి నియంత్రణ ప్రత్యేక కార్యక్రమం ఐ.డి.సి.ఎఫ్.లో భాగంగా ప్రతి అంగన్వాడీ కేంద్రంలో జింక్ మాత్రలు, ఓ.ఆర్.ఎస్. అందుబాటులో ఉంచాలని తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ లు సంక్రమంగా ఇవ్వాలి అని డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధుల గురించి ప్రతీ ప్రైవేట్ ఆసుపత్రి నుండి తగిన సమాచారం, నివేదికలు ఇవ్వాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వైద్యాధికారులు, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు డా.విజయలక్ష్మి, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా.చంద్రశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి, డి.డబ్ల్యూ.ఓ, మున్సిపల్ కమిషనర్లు, వైద్య శాఖ ప్రోగ్రాం అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.


నిజామాబాద్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్

డెలివరీ చేసి శిశువు విక్రయం

- కామారెడ్డిలోని సమన్విత ఆస్పత్రి తీరు
- సహకరించిన గాంధారి పీహెచ్‌సీ వైద్యులు డా.ప్రవీణ్‌కుమార్, ఆయన తండ్రి
- పెండ్లికిముందే గర్భం దాల్చిన మహిళతో పాటు కొన్న వారి నుంచి సైతం డబ్బులు వసూలు
- భర్త ఫిర్యాదుతో నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి


నిందితులను అదుపులోకి తీసుకొని వివరాలు వెల్లడిస్తున్న సీఐ

నవతెలంగాణ-కామారెడ్డి

పెండ్లికిముందే గర్భం దాల్చిన యువతి.. భర్తకు తెలియకుండా ప్రసవం చేయించుకుంది. పుట్టిన బిడ్డను ఆస్పత్రి వైద్యులు విక్రయించారు. తీరా భర్తకు విషయం తెలిసి ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగప్రవేశం చేసి నిందితులను అరెస్టు చేసి ఇందుకు సహకరించిన పట్టణంలోని సమన్విత ఆస్పత్రి వైద్యులతో పాటు సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన ఏప్రిల్ నెలలో చోటు చేసుకోగా.. తాజాగా వెలుగుజూసింది. శనివారం కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు.

తాడ్వాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన లావణ్యకు రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామానికి చెందిన మహేశ్‌తో ఫిబ్రవరి నెలలో పెండ్లయింది. కాగా పెండ్లికి ముందే లావణ్య గర్భం దాల్చింది. ఆరు నెలల చూలాలు. కాగా భర్తకు తెలియకుండా డెలివరీ చేయించుకునేందుకు ఏప్రిల్ 8వ తేదీనా కామారెడ్డి జిల్లా కేంద్రంలో గల సమన్విత హాస్పిటల్‌కు వచ్చింది. ఇప్పుడే తనకు డెలివరీ చేయాలని ఆ పాప తనకు అవసరం లేదని సమన్విత ఆసుపత్రి మేనేజర్ అయిన ఉదయ్ కిరణ్‌ను సంప్రదించింది. అందుకు రెండు లక్షల వరకు ఖర్చు అవుతుందని బేరం కుదరచుకున్నాడు. గాంధారి పిహెచ్ఎస్‌లో విధులు నిర్వహించే డాక్టర్ ప్రవీణ్‌కుమార్, అతని తండ్రి ఇట్టం నడిపి సిద్ధిరాములతో కలిసి మాట్లాడి 80,000 రూపాయలను ఉదయ్ కిరణ్‌కు ఫోన్ పే చేయగా మరో 50,000 నగదుగా చెల్లించాడు. నార్మల్ డెలివరీ అయిన తర్వాత పాప ఆరోగ్యం బాగాలేక శిశురక్ష ఆసుపత్రికి పంపించారు. పుట్టిన పాపను ఇతరులకు విక్రయించేందుకు మధ్యవర్తి అయిన ఇట్ట బాలకృష్ణను రప్పించి బాలకృష్ణ ద్వారా సిరిసిల్ల జిల్లాకు చెందిన దేవయ్యతో మాట్లాడారు. అతడు, సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన భూపతితో బేరం మాట్లాడి అతని దగ్గర నుండి 80 వేల రూపాయలు తీసుకొని డాక్టర్ ప్రవీణ్‌కు అందజేశారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న ఎనిమిది మందిపై జువైనల్ జస్టిస్ యాక్ట్, ఐపీసీ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఇట్టం నడిపి సిద్ధిరాములపై గతంలోనూ కేసులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని కౌసల్య ఆసుపత్రిలో లింగనిర్ధారణ చేయడం గర్భస్రావం చేయడం లాంటివి చేసి అతనిపై కేసులు నమోదు అయినట్టు తెలిసిందన్నారు.

భర్త ఫిర్యాదుతో వెలుగులోకి


లావణ్య డెలివరీ సమయంలో ఆమె భర్త పేరు మహేష్ అని ఫోన్ నెంబర్ రిజిస్టర్లు రాయగా శిశు రక్ష హాస్పిటల్ వారు మీ పాప కోలుకుందని మీ పాప ఆరోగ్యం ఎలా ఉందని అతనికి ఫోన్ చేయగా, అతను వెంటనే చైల్డ్ వెల్ఫేర్ నెంబర్‌కు ఫోన్ చేసి పాపను విక్రయించిన విషయం చెప్పడంతో తాము రంగంలోకి దిగి కామారెడ్డి ఎస్ఐలు రాజు, సాయిరాం, కానిస్టేబుల్ నవీన్, నరేష్, రవి, నరేందర్, ప్రభాకర్ తదితరులు కలిసి నిందితులందరిని పట్టుకున్నట్టు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులకు రివార్డులు ప్రకటించినట్టు తెలిపారు. సమన్విత హాస్పిటల్‌లో ప్రసవాల గదిని పరిశీలించగా అక్కడ ఎలాంటి రికార్డులు లేవని, పుట్టిన పిల్లలకు ఇచ్చే జనన ధ్రువీకరణ పత్రలు సైతం లేవని పోలీసులు తెలిపారు.

కాగా స్థానికుల వివరాల ప్రకారం.. మహేశ్.. లావణ్యను పెండ్లి చేసుకొని ఇల్లరికం వచ్చాడు. లావణ్య పొట్టపెరగడం చూసి అనుమానంతో టెస్టులు చేయించగా.. గర్భిణీ అని తేలింది. గ్రామంలో పెద్దమనుషులతో పంచాయితీ కొనసాగింది. చివరకు గర్భం తీయించుకుంటే కాపురం చేస్తానని మహేశ్ అంగీకారానికి వచ్చాడు. దీంతో ముందస్తు ప్రసవం చేయించుకున్నారు. అయితే ప్రసవం తర్వాత మహేశ్ తన ఊరికి వెళ్లి పోయి తిరిగి రాలేదు. దీంతో లావణ్య పోలీసులను ఆశ్రయించి కేసు పెట్టింది. దీంతో మహేశ్ సైతం పాప విక్రయానికి సంబంధించి కేసు పెట్టడంతో ఈ తతంగం బయటపడ్డట్టు సమాచారం.

జీపీల నిధులు విడుదల చేయాలి

- పంచాయతీ కార్యదర్శుల డిమాండ్.. వినతి

నవతెలంగాణ-జుక్కల్



కేంద్ర, రాష్ట్ర సీఫ్‌సి, ఎస్ఎఫ్‌సి నిధులతో పాటు ఎంపిడబ్ల్యు నిధులు వెంటనే విడుదల చేయాలని జీపి కార్యదర్శులు డిమాండ్ చేశారు. శనివారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు మండలంలోని 30 గ్రామాల కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీపీ కార్యదర్శుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. గత సంవత్సరం డిసెంబర్ మాసంలో కేంద్ర నిధులు జీపీ ఖాతాలో జమా చేశారని, అనంతరం నాటి నుంచి నేటి వరకు నయా పైసా గ్రాంటు రాలేదన్నారు. ఎస్ఎఫ్‌సి గ్రాంటు సంవత్సరంన్నర నుంచి కేటాయించలేదని, ప్రత్యేక అధికారుల పాలన నుంచి పంచాయతీ కార్యదర్శులు తమ స్వంత డబ్బులు వచ్చే వేతనాల నుంచి పెద్ద జీపీల మొదలు కొని చిన్న జీపీలకు లక్షలలో రూపాయలు ఖర్చు చేసినట్టు వాపోయారు. ఎంపిడబ్ల్యు వారికి గత కొన్ని నెలలుగా వేతనాలు ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచారని, వేసవి కాలంలో కార్యదర్శులు స్వంతగా ఖర్చులు చేసి నీటి సమస్యలు తీర్చామని పేర్కొన్నారు. ట్రాక్టర్ బిల్లులు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోళ్ళు, బోరు మోటార్ల రిపేర్లు, పారిశుధ్య పనులకు ఖర్చులు చేసామని, ఇకపై తాము చేసిన ఖర్చులు వచ్చే వరకు ఎటువంటి ఆర్థిక సంభందిత పనులు నిర్వహించమని మండల కార్యదర్శుల సంఘం వారు ముక్త కంఠంతో తెలిపారు. ప్రభుత్వం వెంటనే జీపీలకు సంభందించిన సీఎఫ్‌సి, ఎస్ఎఫ్‌సి నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతు ఎంపిడీవోకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

మాట తప్పితే పోరాటం తప్పదు

- అంగన్‌వాడీలకు న్యాయమైన డిమాండ్స్ నెరవేర్చాలి
- ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

మాట తప్పితే పోరాటం తప్పదని అంగన్‌వాడీలకు న్యాయబద్ధంగా రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం నగరంలోని ధర్నాచౌక్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో అంగీకరించిన విధంగా టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్స్‌కి రూ.1లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 10ని రద్దు చేయాలని న్యాయబద్ధమైన రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలి డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద ధర్నా ద్వారా ప్రభుత్వానికి నిరసన తెలియజేస్తున్నామన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ విషయంలో ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి సీతక్క టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని వాగ్దానం చేశారని ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే పోరాటం తప్పదని ఆమె అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా సర్కులర్ ఇచ్చి 65 సంవత్సరాలు నిండిన వారిని బలవంతంగా ఇంటికి పంపించే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 65 సంవత్సరాలు పూర్తయిన అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ సుమారు 10వేల మంది పనిచేస్తున్నారు. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని 2023 సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 4 వరకు రాష్ట్రంలో 24 రోజులు అంగన్వాడి ఉద్యోగులు నిరవధిక సమ్మె చేశారు. ఈ సమ్మె సందర్భంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం అంగన్వాడీ టీచర్స్‌కు రూ.2 లక్షలు, హెల్పర్స్‌కు రూ.1లక్ష పెంచుతామని, పెన్షన్, విఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చింది. అనంతరం రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడీ ఉద్యోగుల స్థితిగతులు, గత 24 రోజులు సమ్మె జరిగిన పరిస్థితి, ఆ సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, హామీల్లో ఒకటైన రిటైర్మెంట్ బెనిఫిట్స్ గురించి కూడా వివరంగా ప్రభుత్వం ఐసీడీఎస్ మంత్రి, ఐసీడీఎస్ రాష్ట్ర అధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకువచ్చాము. అయినా పై అంశాలను పరిగణలోకి తీసుకోకపోవడం అన్యాయం. అంగన్వాడీ ఉద్యోగులకు తీవ్రమైన నష్టం కలిగించే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కారం చేయకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా జిల్లా కార్యదర్శి స్వర్ణవాణి, రాజ్యలక్ష్మి, హైమావతి, ఆయాలు, టీచర్లు, పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి

- యాంటీ రేబిస్ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి



టీకాలు వేస్తున్న పశువైద్యులు, అధికారులు

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ వ్యాధుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఆంటీ రేబిస్ టీకాల కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం హిందూ ప్రియా చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జూనోటిక్ వ్యాధులు రేబిస్, ఆంత్రాక్స్, బ్రో సెల్లోసిస్ బర్డ్ ఫ్లూ టీవీ అందులో ముఖ్యమైనవి అన్నారు. ఈ వ్యాధుల నివారణకు తగిన జాగ్రత్తలు పాటించి సక్రమంగా టీకాలు వేయించి నివారించాలన్నారు. దీంతో పాటు కుక్క కాటు వల్ల సంక్రమించే రేబిస్ వ్యాధి అత్యంత ప్రాముఖ్యమైనదని ప్రపంచవ్యాప్తంగా అనేక జోనోటిక్ వ్యాధుల ద్వారా మనుషులలో మరణాలు సంభవిస్తున్నాయన్నారు. సుమారు 30 శాతం మరణాలు మన భారతదేశంలో సంభవిస్తున్నాయని ఆయన తెలిపారు. కుక్క కాటు వల్ల వచ్చే రేబిస్ వ్యాధి నివారణకు కుక్కల యజమానులు క్రమం తప్పకుండా ఏడాదికి ఒకసారి రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. కామారెడ్డి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని 23 మండల కేంద్రాలలో శనివారం జూనోటిక్ వ్యాధుల నివారణకు కుక్క కాటు ఆంటీ రేబిస్ వ్యాధి టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. కుక్క కాటును అశ్రద్ధ చేయకుండా కుక్క కాటు వేసిన వెంటనే పదిహేను నిమిషాలలో నల్ల నీరుతో కడిగి, టెక్చర్ అయోడిన్ వేయాలని తర్వాత ఆసుపత్రికి వెళ్లాలని అన్నారు. ఆస్పత్రి వైద్యుల సూచన ప్రకారంగా కుక్క కాటు వేసిన రోజు, మూడవరోజు, ఏడవ రోజు, 14వ రోజు 28వ రోజు టీకాలు వేయించుకొని ప్రాణాలను కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ప్రాంతీయ పశు వైద్యశాల ఏడి డాక్టర్ సంజయ్ కుమార్, కౌన్సిలర్లు మానస, సురేష్, శివ, వంశీకృష్ణ, పశు వైద్యులు డాక్టర్ దేవేందర్, డాక్టర్ రవికిరణ్ , డాక్టర్లు అనిల్ రెడ్డి, సిబ్బంది సాయి రెడ్డి, నరేష్, నితిన్, శ్రీనివాస్, బాబా గౌడ్, కిషన్, బహదూర్, ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
నిజామాబాద్
ఆదివారం | జులై 07, 2024 | www.navatelangana.com

అద్దె బకాయిలు చెల్లించనందుకు మడిగెలు సీజ్


మడిగెలను సీజ్ చేస్తున్న ఈవో రవీందర్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో గల మూడు మడిగేలను సీజ్ చేసినట్టు ఈవో రవీందర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మడిగెలకు సుమారు 25 నెలల నుంచి కిరాయి చెల్లించనందుకు సీజ్ చేసినట్టు వివరించారు. మడిగెలు తీసుకున్నవారు సకాలంలో కిరాయి చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులున్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి


నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పార్టీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఆనాడు కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా కొనసాగి, ఆర్టికల్ 370కి వ్యతిరేఖంగా తన మంత్రి పదవినే త్యాగం చేసిన ఘనుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని, ఆయనకు బీజేపీ పార్టీ తరపున నివాళులు అర్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కొండ ఘన శ్యామ్, నాయకులు బోనగిరి ప్రశాంత్, అయోధ్య నర్సయ్య, గంగేష్, వంశీ, విఠల్, శేఖర్ పాల్గొన్నారు.

మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం


మాజీ ఎంపీటీసీలు, జడ్పీటీసీకి సన్మానం

నవతెలంగాణ-ముప్కాల్

ఎంపీటీసీ, జడ్పీటీసీ, కో-ఆప్షన్ సభ్యుల ఐదేళ్ళ పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంలో శనివారం ఉదయం ముప్కాల్ మండల కేంద్రంలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో "ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ" ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ, జడ్పీటీసీ, కో-ఆప్షన్ సభ్యులను ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో మాజీ ఎంపీపీ సామ పద్మ, మాజీ జడ్పీటీసీ బద్దం నర్సవ్వ, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నాయకుడు పద్మ మాజీ కో-ఆప్షన్ సభ్యులు మునిరోద్దీన్ ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల పాటు ప్రజా సేవలో నిమగ్నమై సేవలు అందించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజుల్లో సైతం ఇదే తరహాలో మండల, గ్రామ స్థాయిలో ప్రజలకు సేవలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో "ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ" సభ్యులు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్, అంజయ్య, పీడీ రాజ్ కుమార్, గోపీనాథ్, పుష్పానాథ్ రెడ్డి, జక్కుల ప్రవీణ్, సంజీవ్ థామస్, హరీష్, నరేష్, ముస్కు శ్రీను, వినోద్, నవీన్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ ఉజ్మ

నవతెలంగాణ-రెంజల్

వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ ఉజ్మ పేర్కొన్నారు. శనివారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి తగిన మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి ముందర ఏర్పడిన మురికి గుంటలను పూడ్చి వేసుకోవాలని, పాత టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ఎక్కువగా దోమల వల్ల వ్యాపించే అవకాశం ఉన్నందున పరిసర ప్రాంతాలను శుభ్రంగా చేసుకోవాలని ఆమె అన్నారు. వర్షాకాలంలో కొత్తనీరు వచ్చే అవకాశం ఉన్నందున కలుషితమైన నీటిని తాగొద్దని, గోరువెచ్చని నీటిని తాగాలని ఆమె తెలిపారు. వర్షాకాలంలో ఫైలేరియా, మలేరియా, డెంగ్యూ, పచ్చకామెర్లు వచ్చే అవకాశం ఉన్నందున దోమతెరలను వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారులు కరిపే రవీందర్, చింతల శ్రావణ్ కుమార్, ఆరోగ్య కార్యకర్తలు జానకి, రాణి, అంగన్వాడి టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

10 సంవత్సరాలు పాలించినా..

రాష్ట్ర విభజన సమస్యలు పరిష్కరించలే


మాట్లాడుతున్న దేగాం యాదగౌడ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గత ప్రభుత్వం పది సంవత్సరాలు పాలించినా.. తెలంగాణ విభజన రెండు రాష్ట్రాల సమస్యలు పరిష్కరించకపోవడం సిగ్గుచేటని తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యాదగౌడ్ అన్నారు. శనివారం టిడిపి పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పది సంవత్సరాలు పాలించిన, తెలంగాణ విభజన రెండు రాష్ట్రాల సమస్యలు పరిష్కరించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చలపై ముక్కు విరువడాన్ని తెలుగుదేశం పార్టీ తరపున ఖండించారు. కార్యక్రమంలో అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్, అర్బన్ అధ్యక్షులు అంబిక సత్యనారాయణ, లవంగ రాజు, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

9న యూనివర్సిటీలో జాబ్ మేళా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ ఆదేశానుసారం యూనివర్సిటీలో పీ.జీ. ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 9న తెలంగాణ యూనివర్సిటీలో, తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సంస్థలు సంయుక్తంగా డీ.ఎస్. టెక్నాలజీస్ కంపెనీలో గల టెక్నికల్ రిక్రూటర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూట్, డిజిటల్ మార్కెటింగ్ ఖాళీల భర్తీకి డి.ఎస్.టెక్నాలజీస్ వారిచే ఉద్యోగ మేళాను నిర్వహించనున్నారని ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పాతా నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో ఉద్యోగ ఔత్సాహిలకు పిఐఆర్ (వ్యక్తిగత పరిచయ రౌండ్) గ్రూప్ డిస్కషన్, ముఖాముఖి వంటి రౌండ్‌లతో ఇంటర్వ్యూ నిర్వహిస్తారని పేర్కొన్నారు. పీజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులందరూ ఈనెల 8వ తేదీలోపు ప్లేస్మెంట్ సెల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని డైరెక్టర్ సూచించారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం


బోధన్: సాలూర సొసైటీలో జెండా ఆవిష్కరించిన చైర్మన్


ఏర్గట్లలో..

- వెల్లడించిన సహకార సంఘం అధ్యక్షులు
- ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం
- జెండాలను ఎగురవేసిన సొసైటీ చైర్మెన్లు

నవతెలంగాణ-విలేకరుల బృందం

రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని సహకార సంఘం అధ్యక్షులు తెలిపారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం పలు సహకార సంఘం కార్యాలయాల ఎదుట 7రంగుల జెండాలను ఆవిష్కరించారు.

మోర్తాడ్ : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సహకార వారోత్సవాల జెండాను సంఘ చైర్మన్ బద్దం అశోక్ రెడ్డి ఆవిష్కరించారు. సహకార సంఘ వారోత్సవాల్లో భాగంగా సహకార జెండాను ఎగరవేసినట్లు చైర్మన్ తెలిపారు. వారం రోజులపాటు సహకార వారోత్సవాలను నిర్వహించుకుంటూ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామని వివరించారు. రైతు సంక్షేమం కోసం సహకార సంఘాలు పనిచేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు భూమన్న, నవీన్, లక్ష్మణ్, మహిపాల్, భూమేశ్వర్, సాయన్న సహకార సంఘ కార్యదర్శి కాశిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల : అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్‌లలో సంఘ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య, పెద్దకాపుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏడు రంగుల సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం జులై నెలలో మొదటి శనివారం అంతర్జాతీయ సహకార రోజుగా జరుపుకుంటామని అన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించడమే సంఘాల లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు సిగసారం గంగారాం, జీ.కే.శ్రీనివాస్ రెడ్డి, సంఘం డైరెక్టర్లు, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

ముప్కాల్ : 'అంతర్జాతీయ సహకార సంఘం దినోత్సవం' పురస్కరించుకుని రెంజర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సొసైటీ అధ్యక్షులు కోమటిశెట్టి గంగాధర్ జెండా ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సొసైటీ డైరెక్టర్లతో కలిసి స్థానిక సొసైటీ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రతి ఒక్క రాయితీలను సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ముస్కు సంతోష్ రెడ్డి, సెక్రటరీ కె.గంగాధర్, డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని రెంజల్, దూపల్లి, నీలా గ్రామాలలో సహకార వ్యవసాయ పరపతి సంఘాల ఆవరణలో వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. రెంజల్ సింగిల్ విండో ఆవరణలో చైర్మన్ మొహీనుద్దీన్, దూపల్లి సహకార సంఘం చైర్మన్ శేషుగారి భూమారెడ్డి, నీల సింగిల్‌విండో చైర్మన్ ఇమామ్ బేగ్‌లు జెండాలను ఎగురవేసి వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా సింగిల్ విండో పాలకవర్గ సభ్యులు, సీఈవోలు రాము, జీవన్‌రెడ్డి, రాందాస్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్ : సాలూర మండలంలోని సొసైటీలో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి కూటమి, యునైటెడ్ నేషన్స్ కమిటీ ఫర్ ప్రమోషన్ అడ్వాన్స్మెంట్ ఆఫ్ కో ఆపరేటివ్స్ సంయుక్తంగా 1995 సంవత్సరంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సహకార సమితి ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఈ సహకార దినోత్సవాలను ఘనంగా జరిపినట్లు సొసైటీ అధ్యక్షులు అల్లె జనార్దన్ తెలిపారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం 7 రంగుల సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి బస్వంత్ రావు, సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


ముప్కాల్‌లో..


మోర్తాడ్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న పాలకవర్గం సభ్యులు, సిబ్బంది

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే తిరుగుబాటు తప్పదు

- డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలి
- పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ప్రభుత్వానికి నిరుద్యోగుల తిరుగుబాటు తప్పదని తగిన గుణపాఠం చెబుతామని పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పి.డి.ఎస్.యూ ఆధ్వర్యంలో నిరుద్యోగులతో కలిసి జిల్లా కేంద్రంలో సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరసన తెలపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నేడు ఉద్యోగ నోటిఫికేషన్‌లలో తక్కువ పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్నారని, టీచర్ల ప్రమోషన్లలో వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, 20 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ ప్రకటించాలని, ప్రిపరేషన్‌కు కొన్ని రోజులు పొడగించి డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని అన్నారు. గ్రూప్ 2, 3 పోస్టులను వెంటనే పెంచాలని తెలిపారు. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 పిలవాలని, ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయాలని, గురుకుల అభ్యర్థులకు న్యాయం చేయాలని అన్ని శాఖలలో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అశోక్, రవి, హరీష్, సంజు, శ్రీకాంత్, అలేఖ్య, సాయిప్రసాద్, శ్రీలత పాల్గొన్నారు.


సెంట్రల్ లైబ్రరీ వద్ద నినాదాలు చేస్తున్న నిరుద్యోగులు, పీడీఎస్‌యూ నాయకులు

తాత్కాలిక పద్ధతిలో ఉద్యోగావకాశాలు

నవతెలంగాణ-ముప్కాల్

'శ్రీరాంసాగర్ మహిళా రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్'లో తాత్కాలిక పద్ధతిలో సీఈవో, మేనేజర్, అకౌంటెంట్ ఉద్యోగాలకు దరఖాస్తులను కోరుతున్నట్లు ముప్కాల్ ఏపీఎం ప్రసాద్ రావ్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు సీఈవో, మేనేజర్ పోస్టులకు బీఎస్సీ అగ్రికల్చర్, అగ్రికల్చర్ మార్కెటింగ్, అగ్రి బిజినెస్ మేనేజ్మెంట్ లేదా ఇంటర్ పూర్తి చేసి డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, అగ్రికల్చర్ మార్కెటింగ్, అగ్రి బిజినెస్ మేనేజ్మెంట్ లేదా వాటికి సమానమైన కోర్సులు పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఒక సంవత్సరం పాటు క్షేత్రస్థాయిలో పనిచేసిన అనుభవం ఉండాలని వివరించారు. అదేవిధంగా అకౌంటెంట్ ఉద్యోగానికి బీకాం కంప్యూటర్ పూర్తి చేసి ఉండాలని అన్నారు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5గంటలలోపు బాల్కొండ మహిళ సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు ఈ 8790990130 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

టీయూ తెలుగు విభాగంలో యం.వెంకటేశ్వర్లుకు డాక్టరేట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగంలో పరిశోధక విద్యార్థి యం.వెంకటేశ్వర్లు సీనియర్ ఆచార్యులు పి.కనకయ్య పర్యవేక్షణలో 'తెలుగు సాహిత్యం విమర్శ - కోవెల సుప్రసన్న గారి కృషి' అనే అంశంపై పరిశోధన జరిపారు. శనివారం జరిగిన బహిరంగ మౌఖిక పరీక్షకు ఎక్స్టర్నల్ ఎగ్జామినర్‌గా ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి హాజరై పరిశోధన సిద్ధాంత గ్రంథం పై విస్తృతమైన ప్రశ్నలు లేవనెత్తారు. పరిశోధకుడు అన్ని ప్రశ్నలకు ప్రయోగాత్మకమైన ఉదాహరణలతో సమాధానాలు ఇచ్చారు. ఈ పరిశోధన సమాజంలోని తెలుగు సాహిత్యంలో కృషి చేస్తున్న విమర్శకులకు ఈ సిద్ధాంత వ్యాసం దిక్సూచిగా ఉపయోగపడుతుందని తెలుగు సమాజంలో పీటికలు, ముందు మాటలు రాసే వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈ పరిశోధన ఒక గ్రంథం మంచి చెడులను విమర్శనాత్మకంగా నివేదిస్తుందని పరిశోధక విద్యార్థి యం.వెంకటేశ్వర్లు అందించిన జవాబులకు బహిరంగ మౌఖిక పరీక్షకు హాజరైన ఆచార్యులు సంతృప్తి వ్యక్తం చేసి పీహెచ్డీ డిగ్రీకి ఆమోదం తెలిపారు. ఈ బహిరంగ మౌఖిక పరీక్షకు కళల పీఠాధిపతి ఆచార్య కే లావణ్య, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామ్ డాక్టర్ అరుణ, డాక్టర్ లక్ష్మణ్ చక్రవర్తి, ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ చెందిన రమణాచారి, హిందీ విభాగానికి చెందిన డాక్టర్ మొహమ్మద్ జమీల్, ఉర్దూ విభానికి చెందిన డాక్టర్ ముహమ్మద్ అబ్దుల్ ఖవి పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


డాక్టరేట్ ప్రదానం

ఎక్కువ నిధులు తీసుకురండి

- బండిసంజయ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్ర ప్రభుత్వం నుండి ఎక్కువ నిధులు రాష్ట్రానికి వచ్చే విధంగా చూడాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. శనివారం బిజెపి పార్టీ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి..

స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలలో పాల్గొని మహనీయునికి ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన ముఖర్జీ జయంతి వేడుకలలో జీవి నరసింహరెడ్డి, యామాద్రి భాస్కర్, జెస్సు అనిల్, పెర్కిట్ దుగ్గి విజయ్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఇస్సపల్లి, అంకాపూర్ గ్రామాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సల్ల బొర్రయ, ఎల్.రాజేందర్, రవిరాజు, బిల్లా చందు, మట్ట గంగాధర్, కోలా కిషన్, గుంజల ప్రతాప్, ఎల్.రమేష్, రాజేశ్వర్, పి.స్వామి, పి.రాము, గాండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి

నవతెలంగాణ-బోధన్

భారత మాజీ ఉప ప్రధాని, ప్రముఖ సంఘసంస్కర్త డా.బాబు జగ్జీవన్ రాం 41వ వర్ధంతిని పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా శనివారం నిర్వహించారు. ఈ సంవర్భంగా బాబు జగ్జీవన్ రాం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రామ్ భారత ఉప ప్రధానిగా పని చేసి ఎన్నో సంస్కరణలను అమలు చేశారని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా, కార్మిక శాఖ మంత్రిగా పని చేసిన ఆయన నిమ్న వర్గాల నాయకుడిగా ఎన్నో విధానాల అమలు చేశారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు, దండోర ఉద్యమనేత లింబూరి లక్ష్మణ్, డల్లా సురేష్, గంధమాల చంద్రయ్య, భూమయ్య, సాయిలు, బండారి పోశెట్టి, బోధన్‌టౌన్ అధ్యక్షులు తాడేపు అబ్బయ్య, జేఏసీ శంకర్, జాదవ్ ఫకీరా నాయక్, పాల్గొన్నారు.


నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వన మహోత్సవానికి మొక్కలను సిద్ధంగా ఉంచాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

త్వరలో చేపట్టబోయే వన మహోత్సవంలో భాగంగా నాటేందుకు అవసరమైన మొక్కలను సిద్ధంగా ఉంచాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని ఉప్లూర్‌లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున గ్రామంలో నాటేందుకు నిర్దేశించిన లక్ష్యం మేరకు నర్సరీలో మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు. గతంలో హరితహారంలో నాటిన మొక్కలు చనిపోయిన, ఎండిపోయిన చోట కొత్త మొక్కలను నాటించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. నాటిన మొక్కల్లో 60 శాతం పైగా మొక్కలు బతికేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీ నిర్వహణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. నర్సరీలో ఏయే రకాల మొక్కలను సిద్ధం చేస్తున్నారని నర్సరీ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధిహామీలో భాగంగా కొనసాగుతున్న పనులను, మిషన్ భగీరథ తాగునీటి సర్వే పునర్ పరిశీలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేక అధికారి, డిప్యూటీ తహసిల్దార్ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎమ్మెల్యే రాక

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రాన్‌పల్లి మండలానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి సోమవారం రానున్నట్లు తహసీల్దార్ కిరణ్మయి శనివారం తెలిపారు. ఉదయం 11గంటలకు జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో గల అరుంధతి ఫంక్షన్‌హాల్‌లో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నారని పేర్కొన్నారు.

బాబుజగ్జీవన్‌రామ్‌కు వర్ధంతి నివాళి

నవతెలంగాణ-కామారెడ్డి


నివాళులర్పిస్తున్న పలువురు

కామారెడ్డి పట్టణంలోని హరిజనవాడలో శనివారం భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతిని మాదిగా రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ అన్ని వర్గాల కులాలకు ఎన్నో సేవలు అందించిన గొప్ప వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాగయ్య మాదిగ, కొత్తూరి బూదయ్య, పి దయానంద్, కోటి అశోక్, కొత్తూరు గంగయ్య, ఎల్లయ్య, కృష్ణ, మధు, తదితరులు పాల్గొన్నారు.

గజమాలతో సన్మానం

నవతెలంగాణ-బిచ్కుంద



జుక్కల్ నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి వైద్య శిబిరాలతో పాటు రక్తదాన శిబిరాలు నిర్వహించి ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిచ్కుంద మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ప్రేమ్ కుమార్, అసుపత్వార్ అశోక్ తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావును అంబేద్కర్ చౌరస్తా నుండి ప్రధాన మార్కెట్ వరకు స్వాగతం పలికి గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. బండయప్ప కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ధర్పల్లి గంగాధర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు స్నేహభావంతో ఉండాలి

- ర్యాంగింగ్‌తో బాధితులకు ఆవేదన.. నిందితులపై కఠిన చర్యలు
- అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.దీక్ష

నవతెలంగాణ-సదాశివనగర్/లింగంపేట్

ఇన్స్పైర్ సొసైటి ఫర్ రూరల్ డెవలప్మెంట్ (ఐ.యస్.ఆర్.డి) స్వచ్ఛంద సంస్థ , జిల్ల న్యాయ సేవాదికార సంస్థ ఆధ్వర్యంలో సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.దీక్ష హాజరై మాట్లాడుతూ ర్యాగింగ్ ఒక దుశ్చర్య, నేరమని, దాని వల్ల బాధితులు తీవ్ర ఆవేదన అనుభవించాల్సి వస్తుందని తెలిపారు. ర్యాగింగ్ పట్ల చట్ట పరంగా కఠిన చర్యలు ఉంటాయని, ఈ చర్యలు చట్టపరంగా శిక్షార్హమని వివరించారు. విద్యార్థులు సహనం స్నేహభావంతో వ్యవహరించాలని సూచించారు. ర్యాగింగ్‌కు ఎవరైనా పాల్పడితే జిల్లా కోర్టులో సంప్రదించాలని ఎవరైనా అలాంటి సంఘటనలు ప్రేరేపించిన, ప్రోత్సహించిన వారికి చట్టపరంగా శిక్షలు తప్పవు అని, లక్ష్యం పెట్టుకొని లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రయత్నించాలని మంచి భవిష్యత్ నిర్మించుకోవాలని ర్యాగింగ్‌కు తావులేని క్యాంపస్ గా ఉంచాలని భవిష్యత్ లో ఉన్నత చదువులకు వెళ్ళిన దగ్గర కూడా ర్యాగింగ్ చేయకూడదు చేస్తున్న వారిని చట్టానికి పట్టించాలని ఆకతాయిలు బాలికలను వేదిస్తే ఇబ్బందులకు గురి చేస్తే షీ టీం మరియు పోలీస్ లకు కంప్లయింట్ చేయాలని ర్యాగింగ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1800-180-5522 కు కాల్ చేయాలని విద్యార్థులకు సూచించారు.

ర్యాగింగ్ వ్యతిరేకంగా విద్యార్థులతో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయడంతో పాటు యాంటీ ర్యాగింగ్ పోస్టర్లను అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది, కళాశాల ప్రిన్సిపల్, ఐయస్ఆర్‌డి స్వచ్ఛంద సంస్థ ప్రతినిదులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మోహన్ రావు, ఐయస్ఆర్‌డి స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి అమృత రాజేందర్‌రావు, కళాశాల ప్రిన్సిపల్ అజ్మల్ ఖాన్, ఐయస్ఆర్‌డి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అర్ల విఠల్ రావు, న్యాయ సేవాదికార సంస్థ ప్రతినిదులు సాయి కృష్ణ, సాయి ప్రణీత్, అధ్యాపకులు చంధు, ప్రకాష్, సుధాకర్, మల్లయ్య, రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పలువురు

చట్టాలు అందరికి సమానమే : ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక

లింగంపేట్ : చట్టాలు అందరికీ సమానమే విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి అని ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక తెలిపారు. శనివారం లింగంపేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చట్టాలపై కళాశాలకు చెందిన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని కొత్త చట్టాలు వాటి విధానాలను వివరించారు. అదేవిధంగా ఫోక్సు చట్టం కేసు గురించి వివరించారు. లైంగిక వేధింపులకు గురి చేస్తే కఠినమైన కేసులు ఉంటాయన్నారు. వాటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేయరాదన్నారు. కళాశాలలో ర్యాగింగ్ లకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. చట్టాలు చాలా కఠినమైనవని చట్టాలకు అనుగుణంగానే మనము ఉండాలన్నారు చట్టాలు ఎవరికి చుట్టాలు కావన్నారు. కేసుల బారిన పడితే విలువైన జీవితాలు అంధకారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నరేందర్ లింగంపేట చైతన్య కుమార్ రెడ్డి ఎల్లారెడ్డి బార్ అసోసియేషన్ సభ్యులు నాగం సాయిబాబా సతీష్ కళాశాల లెక్చరర్లు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం


హైకోర్టు న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ కార్యనిర్వాహక ఛైర్మన్ సుజోయ్ పాల్‌కు, రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ పంచాక్షరికి కామారెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తి డా.సివిఆర్‌ఆర్ వరప్రసాద్ శనివారం స్వాగతం పలికారు. నిజామాబాద్ పర్యటనకు వెళ్తున్న వీరు కామారెడ్డిని సందర్శించి న్యాయాధికారులందరితో సమావేశం నిర్వహించారు. అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాసనాయక్, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి, జూనియర్ సివిల్ జడ్జిలు టి.సుధాకర్, దీక్షా, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, టౌన్ సిఐ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు న్యాయమూర్తులకు స్వాగతం పలికారు.

పెంపుడు జంతువులకు టీకాలు


కుక్కకు టీకా వేస్తున్న వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ప్రపంచ జోనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రాంతీయ వెటర్నరీ హాస్పిటల్ లో 28 కుక్కలకు టీకాలు వేసినట్లు ఎల్లారెడ్డి మండల వెటర్నరీ హాస్పిటల్ సహాయ సంచాలకులు డాక్టర్ ఈశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జోనోసిస్ వ్యాధులు అంటారని, లూయిా పాశ్చర్ అనే శాస్త్రవేత్త రేబిస్ వ్యాధికి టీకాను మొట్టమొదటిసారిగా విజయవంతంగా వినియోగించిన జులై 06 తారీఖును ప్రతి సంవత్సరం ప్రపంచ జోనోసిస్ దినోత్సవంగా జరుపుకుంటామని గుర్తు చేశారు. పెంపుడు జంతువులకు టీకాలు వేయించి సురక్షితంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు రవికుమార్, రమేష్,ఆసుపత్రి సిబ్బంది స్థానిక కౌన్సిలర్ బాలమణి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలి

- ఎంపిడీవో శ్రీనివాస్


జెసిబితో పిచ్చి మొక్కలను శుభ్రం చేయిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-జుక్కల్

పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిడీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం గ్రామాలలోని ఎపీపీఎస్ పనులు, అంగన్ వాడీ కేంద్రం, సిసిరోడు పనులు, ఎంపిపీఎస్ పాఠశాలలోని తాగునీరు వసతిని ఆయన పరిశీలించారు. ఎంపిడీవో సమక్షంలో మురికి కాలువల శుభ్రత, డ్రేన్స్ రోడ్ల వెంట ఉన్న పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా ఎంపిడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇంటి పన్నులు వసుళ్ళ చేయాలని, సీజనల్ వ్యాదులు ప్రభలకుండా బహిరంగా మలమూత్ర విసర్జన చేసే వారికి అవగాహన చేసి మరుగు దొడ్లు నిర్మించుకొని వాడుకోనే విధంగా అవగాహన చేయాలని జీపీ కార్యదర్శి షిండే విజయ్ కూమార్‌ను ఆదేశించారు. ఎంపీడీవోతో పాటు జీపీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నష్టం కలిగించే

జీవో నెంబర్ 10ని రద్దు చేయాలి

- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని
- సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-మద్నూర్

అంగన్‌వాడీలకు నష్టం కలిగించే జీవో నెంబర్ 10ని రద్దు చేయాలని, అంగన్‌వాడీ, ఆయాలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని అంగంవాడీలు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనలకు సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు సురేష్ గొండ మద్దతు పలుకుతూ ఆందోళన చేశారు. అంగన్‌వాడీలకు నష్టం కలిగించే జీవో నెంబర్ 10ని వెంటనే రద్దు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంగన్వాడీ టీచర్ కు రెండు లక్షల హెల్పర్ కు ఒక లక్ష పెంచాలని, విఆర్ఎస్ కల్పిస్తూ కొత్త జీవో జారీ చేయాలని, రిటైర్మెంట్ అయ్యే టీచర్లకు హెల్పర్లకు జీతంలో సగం జీతాన్ని పెన్షన్‌గా అందించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.


ధర్నా చేపట్టిన అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు, సీఐటీయూ నాయకులు

కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని యూనియన్ నాయకులు అంగన్వాడి టీచర్లు అనసూయ, సచిత, సుమలత, లక్ష్మీ, శాంతాబాయి, సుశీల, భారతమ్మ, శేషాబాయి, రుక్మిణి భాయి, నసీమాబీ పాల్గొన్నారు.

పంటల పరిశీలన


పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని అంజనీ గ్రామ శివారులో శనివారం మండల వ్యవసాయ శాఖ అధికారి నదీమ్ ఉద్దీన్ రైతులతో కలసి సొయా పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీడ పురుగుల నుండి పంటలను ఎలా కాపాడుకోవాలో పురుగుల నివారణకు పలు క్రిమి సంహారక మందులను ఎలా పిచికారీ చెయ్యాలో వాటి పైన రైతులకు సలహాలు సూచనలు చేశారు. అవసరం ఉన్నపుడు మండల రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు సంప్రదిస్తే తగు సలహాలు సూచనలు ఇస్తామని తెలిపారు.

ఘనంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి

నవతెలంగాణ-సదాశివనగర్

శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నివాళి అర్పించారు. పార్టీ కామారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు తోట బాలరాజు అధ్యక్షతన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి టీ రమేష్ రావు, ఎస్.రవీందర్, కామారెడ్డి జిల్లా కార్యదర్శి వడ్ల నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన నాయకులు..

కామారెడ్డి: శ్యామ్ ముఖర్జీ జయంతి సందర్భంగా బిజెపి జిల్లా కార్యాలయంలో మొక్కలు నాటినట్లు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి తెలిపారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ ప్రముఖ జాతీయవాద నేతలలో ముఖ్యుడని 1951లో భారతీయ జనసంఘ్ పార్టీ స్థాపించిన ముఖర్జీ మంత్రిగా ఉండి ఈ మంత్రి పదవి కంటే నా దేశమే ముఖ్యమని. ఒకే దేశం ఒకే చట్టం ఒకే రాజ్యాం గం ఉండాలి అని. ఒకే దేశంలో రెండు జెండాలు, రెండు చట్టాలు ఉండకూడదని మొట్టమొదటిగా అక్రోషించిన వ్యక్తి శ్యామ ప్రసాద ముఖర్జీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్ జైన్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుల భరత్, కౌన్సిలర్ నరేందర్ , నాయకులు సంధ్య, వేణు, సంతోష్ రెడ్డి, రజినీకాంత్, రవీందర్, రాజుపాటిల్, రాజేష్, ప్రతాప్, లింగం, గోవర్ధన్, రానీల్, భరత్, లింగం, నరేష్, నవీన్, రాజ గోపాల్ పాల్గొన్నారు.


సదాశివనగర్: మొక్కలను నాటుతున్న నాయకులు

రెండు కిలోల గంజాయి పట్టివేత

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని గోపన్‌పల్లి చౌరస్తా వద్ద శుక్రవారం రాత్రి ఎస్సై మోహన్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు చేస్తుండగా బైక్ పై రెండు కిలోల ఎండు గంజాయి తరలిస్తుండగా ఎస్ఐ పట్టుకున్నారు. ఎస్సై మోహన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెద్ద కొడప్ గల్ మండలం పోచారం తండాకు చెందిన రమేష్, అఖిల్, చౌదరి సింగ్ ద్విచక్ర వాహనంపై పోచారం నుండి బాన్సువాడ కు గంజాయి తరలిస్తుండగా గోపన్ పల్లి చౌరస్తా వద్ద పట్టుకున్నారు. అఖిల్, చౌదరిసింగ్ పారిపోగా రమేష్‌ను పట్టుకొని రెండు కిలోల గాంజాతో పాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి రమేష్ పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

మొక్కలు పంపిణీ చేసిన ఎంపీఓ


మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపీఓ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని రుద్రారం, మత్తమాల గ్రామాలలో శనివారం నాడు ఎంపీఓ ప్రకాష్ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. చెట్లే మానవాళికి జీవాధారమని, విచ్చలవిడిగా చెట్లను నరకడం వలన ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయని, స్వచ్ఛమైన గాలి ఇచ్చే చెట్లను కాపాడుకునే బాధ్యత అందరిపైనా ఉంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం మత్తమాల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

చిన్నఎక్లారా గ్రామంలో అన్నదానం

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని చిన్న ఎక్లారా గ్రామస్తులంతా వాన కోసం ఆ గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

డాక్టర్ శ్యాం ప్రకాష్ ముఖర్జీ వర్ధంతి, జయంతి సందర్భంగా లింగంపేట్ మండల కేంద్రంలో 172 బూత్‌లో శనివారం బిజెపి నాయకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు మాసుల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చినటువంటి హామీలు ఆరు నెలలైనా రైతుబంధు మరియు 2500 మహిళ మహిళలకు రెండు లక్షల రుణమాఫీ చేయడం లేదన్నారు దీనిపైన ఏకతాటిగా రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మాసుల శ్రీనివాస్, మండల కన్వీనర్ మరి బాపి రెడ్డి, కో కన్వీనర్ జక్సాని దత్తు రాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జుక్కల్ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించిన కార్యకర్తలు
- పలు చోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహణ

నవతెలంగాణ-విలేకరులబృందం

జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్‌రావు జన్మదినం పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు శనివారం వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచుకున్నారు. పలు చోట్ల రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహించారు.

పిట్లం : మండలంలోని చిల్లర్గి గ్రామ మాజీ జడ్పిటిసి మురళీధర్ గౌడ్ తనయుడు నిఖిల్‌గౌడ్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు స్వచ్ఛందంగా పాల్గొని 70 యూనిట్ల బ్లడ్ అందజేశారు. అనంతరం నిఖిల్ గౌడ్ మాట్లాడుతూ రక్తదాన శిబిరానికి దాతలు, ఫ్రెండ్స్, గ్రామ ప్రజలు ముందుకొచ్చి సహకరించినందుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



మద్నూర్: ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే


క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే

జుక్కల్ : మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అస్పత్ వార్ వినోద్, సీనియర్ నాయకులు రమేష్ రావ్ దేశాయి ప్రత్యేకంగా ఎమ్మెలేను శాలువాతో సన్మానించి మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు భారీగా పాల్గొన్నారు.


పిట్లం: ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా రక్తదానం చేస్తున్న నాయకులు

మద్నూర్ : మండలంలోని కొడిచెర గ్రామంలో తాజా మాజీ సర్పంచ్ సంతోష్ పటేల్ ఇంటివద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్,

మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు చేశారు.

ఎడపల్లి మాజీ ఎంపీపీకి సన్మానం

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మాజీ ఎంపీపీ కే శ్రీనివాస్‌ను అంబం, (వై) గ్రామ యువకులు శాలువాతో శనివారం ఘనంగా సన్మానించారు. ఎంపీపీ శ్రీనివాస్ ఐదు సంవత్సరాల కాలం పాటు ఎడపల్లి మండల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని యూత్ నాయకులు కొనియాడారు. భవిష్యత్తులో రాజకీయ రంగంలో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. ఐదేళ్ల ఎంపీపీ కాలంలో ప్రజా సేవ చేయడంతో తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని కే శ్రీనివాస్ అన్నారు. తనను అంబం వై గ్రామ ప్రజలు ఆదరించి ఎంపీటీసీగా గెలిపించిన అనంతరం బోధన్ మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ షకిల్ అమీర్ సహకారంతో ఎడపల్లి ఎంపీపీ పదవిని చేపట్టానని తెలిపారు.


మాజీ ఎంపీపీని సన్మానిస్తున్న నాయకులు

రైతులకు సేవలు అందించడమే లక్ష్యం

- పిప్రి సొసైటీ చైర్మన్ సోమ హేమంత్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

రైతులకు నిరంతరం సేవలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మండలంలోని పిప్రి సొసైటీ చైర్మన్ సోమ హేమంత్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని పిప్రి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద సహకార ఏడురంగుల జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో ఎరువులు విత్తనాలు అందిస్తూ అవసరమైన దీర్ఘకాలిక రుణాలు అందించినట్టు పంటలను కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గుండా లింగన్న, సీఈవో హన్మాండ్లు, రైతులు సంఘ సిబ్బంది పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న సొసైటీ సభ్యులు

గిరిరాజ్ కళాశాలలో డిగ్రీలో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల 2024-25లో దోస్త్‌తో బి.ఎ., బి.కాం., బి.బి.ఎ., బి.యస్సీ., బి.సి.ఎ.లో మొదటి సంవత్సరం కొరకు దరఖాస్తు చేసుకోవాలని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాంమోహన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకుని సీటు పొంది మొదటి, రెండో, మూడవ ఫేజ్‌లలో ఆన్‌లెస్ సెల్ఫ్ రిపోర్ట్ చేసిన వారు ఈనెల 8 నుంచి 12 వరకు ఉదయం 10 నుండి సాయంత్రం 5 వరకు ఒరిజినల్ ధ్రువపత్రాలు, రెండుసెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు. దరఖాస్తు ఫారంతో దోస్త్ 2024 అప్లికేషన్ కాపీ, సీటు కేటాయింపు లేఖ, ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్ట్ అక్నాలెడ్జ్‌మెంట్, కాన్ఫిర్మేషన్ రిపోర్ట్, ఎస్ఎస్‌సి మెమో, ఇంటర్ టీసీ (ఒరిజినల్), ఇంటర్ మెమో, స్టడీ బోనాఫైడ్ సర్టిఫికెట్లు (1 నుంచి ఇంటర్ వరకు), తారాగణం సర్టిఫికెట్, ఆదాయ ధృవీకరణ పత్రం (తాజాగా 01-04-2024 తర్వాత జారీ చేయబడింది), ఆధార్‌కార్డ్, 4 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, నివాస, స్థానిక అభ్యర్థి సర్టిఫికెట్లు (గ్యాప్ పీరియడ్ కోసం) ఈ ధ్రువపత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

డిగ్రీ వన్ టైమ్ ఛాన్స్ బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు 5వ రోజు ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలోని వన్ టైం ఛాన్స్ (సిబిసిఎస్) బి.ఎ/బీ.కాం./బీ.ఎస్సీ/బిబిఎ కోర్సులకు ఐదవ, ఆరవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ఐదవ రోజున ప్రశాంతంగా జరిగాయి. గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజ్ నిజామాబాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, ఎస్ఆర్ఎన్‌కె గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ బాన్సువాడ, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆర్మూర్‌లో జరిగిన పరీక్షకు ఉదయం 19 మంది విద్యార్థులకు 19 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 24 మంది విద్యార్థులకు 24 మంది విద్యార్థులు హాజరయ్యారని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలియజేశారు.

పరిధిలో ఎం.ఎడ్ మొదటి సెమిస్టర్ 2వ రోజు పరీక్షలు ప్రశాంతం..

తెలంగాణ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల ఎం.ఎడ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు రెండవ రోజున ప్రశాంతంగా జరిగాయి. శనివారం జరిగిన పరీక్షకు ఉదయం 35 మంది విద్యార్థులకు 29 మంది విద్యార్థులు హాజరయ్యారు. 06 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. ఈ పరీక్షలు గిరిరాజ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నిజామాబాద్ సెంటర్లో జరుగుతున్నాయని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

హంగర్స్ ఆఫ్ చేంజ్ అనే సంచికలో బోర్గాం(పి) ప్రభుత్వ పాఠశాలకు చోటు


బోర్గాం(పి) ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-మోపాల్

హంగర్స్ ఆఫ్ చేంజ్ అనే జాతీయ సంచిక-2024 విడుదల చేసిన తన బుక్‌లో నిజామాబాద్ జిల్లాలోని బోర్గం(పి) ప్రభుత్వ పాఠశాలకు సంబంధించి పాఠశాల ప్రాముఖ్యత గురించి వచ్చినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ తెలిపారు. ఈ పాఠశాలను సంబంధించిన ప్రధానోపాధ్యాయులు ముగ్గురు గడ్డం గంగారెడ్డి, సత్యనారాయణ, నర్ర రామారావు ఈ పాఠశాలకు సంబంధించి ముగ్గురు రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకోవడం గొప్ప విషయమని ఈ పాఠశాల జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా మంచి పేరు ఉందని వివరించారు. దాదాపు 900పైగా విద్యార్థులు అలాగే 22 సెక్షన్లకు పైగా తరగతి గదులు ఉన్నాయని వివరించారు. అలాగే ఈ పాఠశాలలో విద్యతో పాటు క్రమశిక్షణ, క్రీడా పోటీలలో ఈ పాఠశాల విద్యార్థులు ముందంజలో ఉంటారని జిల్లాకు అతి సమీపాన ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ పాఠశాల ఉందని పేర్కొన్నారు.

బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-వర్ని(చందూర్)

మండల కేంద్రంలోని మహారాజుల కాలనీలో డా.బాబు జగ్జీవన్‌రాం 38 వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులఅర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్రోల్మెంట్ మండల నాయకులు పోతురాజు మహేందర్ మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్‌రాం అణగారిన వర్గాల కోసం కృషి చేసిన మహనీయుడని అన్నారు. ఆయన అడుగుజాడల్లో నేటి యువకులు నడవాలని కోరారు. కార్యక్రమంలో అరవింద్, శివ కిరణ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వేగవంతం చేయాలి

- ఎంపీడీవో శ్రీనివాస్



నవతెలంగాణ-రెంజల్

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని సాటాపూర్ ప్రైమరీ పాఠశాలతో పాటు ఉర్దూ మీడియం పాఠశాలలో జరుగుతున్న పనులను ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ గౌస్‌ఉద్దీన్ పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభం వల్ల విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి మీర్ మహబూబ్ అలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో

పుస్తకాల పేరిట ఫీజుల దందా

- చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఈవోకు వినతి


డీఈవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అక్షరాల పేరిట లక్షల వ్యాపారం చేస్తున్న శ్రీ చైతన్య పాఠశాలను సీజ్ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం డీఈవో దుర్గాప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేష్ మాట్లాడుతూ.. స్థానిక గూపన్‌పల్లిలోని శ్రీ చైతన్య పాఠశాలలో అక్రమంగా పుస్తకాలు అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేయడం సిగ్గుచేటని అన్నారు. అదేవిధంగా జీవో నెంబర్ 01, 42, 91 ప్రకారం పాఠశాలలో పుస్తకాలు అమ్మవద్దని నిబంధనలున్నా.. యథేచ్ఛగా అమ్ముతున్నారని అన్నారు. అదేవిధంగా ఫీజుల పేరిట, డొనేషన్ల పేరిట విద్యార్థుల తల్లిదండ్రులను హింసించడం దారుణమని అన్నారు. అదే విధంగా 10వ తరగతి విద్యార్థులకు ఇంటర్మీడియట్ సంబంధించి చదువు నేర్పిస్తామని ఇంటిగ్రేటెడ్ టెక్స్ట్ బుక్స్ పేరిట ఆకర్షిస్తూ విద్యార్థులను బలి తీసుకుంటున్నారని అవేదన వ్యక్తం చేశారు. శ్రీ చైతన్య పాఠశాలను, పుస్తకాలు అమ్ముతున్న విద్యాసంస్థ ఎడ్యుకేషనల్ ఇన్ఫ్రా డెవలపర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ శ్రీ చైతన్య పాఠశాల నర్సరీ టెక్నో విద్యార్థులకు రూ.2977 నుంచి 10వ తరగతి క్లాస్ విద్యార్థులకు టెక్నో, సీబీఎస్ఈ తోక పేర్లతో 10,000 రూపాయలు వసూలు చేయడం దారుణమని అన్నారు. శ్రీ చైతన్య పాఠశాల పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దినేష్, నగర ఉపాధ్యక్షులు, కార్తీక్, నగర సహాయ కార్యదర్శి ఆజాద్, నాయకులు రాజు, రఘు తదితర నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కారు ఢీ కొనడంతో మహిళకు గాయాలు

- కారుడ్రైవింగ్ చేసిన వ్యక్తిని చితకబాదిన స్థానికులు
- ఇరువురిని ఆస్పత్రికి తరలించిన గ్రామస్తులు


గాయాలతో పడి ఉన్న వృద్ధురాలు

నవతెలంగాణ-మాక్లూర్

కారు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ముల్లంగి (బి) గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ముల్లంగి గ్రామానికి చెందిన కుమ్మరి కళావతి (50) అనే మహిళ నడుచుకుంటూ పొలం పనులకు వెళ్తోంది. అదే సమయంలో ధర్మోరా నుంచి నిజామాబాద్ వెళుతున్న వ్యాగినర్ కారు అతి వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కారుతో మహిళను ఢీకొన్న వ్యక్తిని చితకబాదారు. వ్యక్తి స్పృహ కోల్పోయాడు. ఇరువురిని 108లో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కారుతో ఢీకొన్న వ్యక్తి నిజామాబాద్‌లోని దుబ్బా ప్రాంతానికి చెందిన జిలకర ప్రసాద్‌గా పోలీసులు గుర్తించారు. కాగా ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


గాయాలపాలైన డ్రైవర్

మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి


జేసీబీ సాయంతో మురికి కాలువను శుభ్రం చేయిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని ఉప్లూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్న పారిశుద్ధ కార్యక్రమాలను ఆయన సందర్శించి పరిశీలించారు. మురికి కాలువల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాల బారిన పడేందుకు ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి నరేందర్‌కు సూచించారు. మురికి కాలువల్లో, నీరు నిల్వ ఉండే గుంతల్లో పంచాయతీ పారిశుధ్య కార్మికులతో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. ప్రజలకు నల్ల నీటిని అందించే పైప్‌లైన్‌లకు లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలు ఏమైనా ఉంటే తక్షణమే మరమ్మతులు చేయించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ ప్రత్యేక అధికారి, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ తదితరులున్నారు.

సాటాపూర్ సంతలో భారీ వర్షం


వర్షం పడడంతో కూరగాయాలను వదిలేసి టెంట్ల కిందకి వెళ్లిన వ్యాపారులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ సంతలో శనివారం సాయంత్రం 6 గంటలకు ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు తమ కూరగాయాలను సంతలోనే వదిలి.. ఇతర టెంట్ల కింద ఉన్నారు. కూరగాయలు కొనేందుకు వచ్చిన వినియోగదారులు సైతం వర్షానికి తడవకుండా ఉండేందుకు ఇతర ప్రాంతాలకు పరుగులు తీయడంతో సంత వెలవెలబోయింది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

- బీఆర్ ఫౌండర్ కొల్లేటి సతీష్



మాట్లాడుతున్న బీఆర్ ఫౌండర్ సతీష్

నవతెలంగాణ-మాక్లూర్

కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీఆర్ ఫౌండర్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలిక పాఠశాలలోని కిటికీలకు, అద్దాలకు రిపేర్ చేశారు. బీఆర్ ఫౌండర్ ఆధ్వర్యంలో చేసిన వారిని కేజీబీవీ పాఠశాల సన్మానించింది. ఈ సందర్భంగా బీఆర్ ఫౌండర్ కొల్లేటి సతీష్ మాట్లాడుతూ.. విద్యార్థినిలు అన్నిరంగాల్లో ముందుండాలని తెలిపారు. విద్యార్థినీలకు ఆర్ ఫౌండర్ అన్ని వేళలా సహాయ సహకారాలు అందించడానికి ముందుంటుందని అన్నారు. మంచిగా చదువుకొని మంచి స్థానంలో ఉండి భవిష్యత్‌లో సమాజానికి ఉపయోగపడాలని తెలియజేశారు. పాఠశాలకు వచ్చిన బీఆర్ ఫౌండర్ సభ్యులకు పాఠశాల ప్రత్యేక అధికారిని ప్రగతి మాట్లాడుతూ.. పాఠశాల కిటికీలకు, అద్దాలకు, పెయింటింగ్‌కు సుమారు రూ.మూడులక్షల వ్యయం అయిందని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఫౌండేషన్ సభ్యులు నర్సారెడ్డి, సంతోష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్‌రెడ్డి


బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసినట్టు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి శనివారం తెలిపారు. నియోజకవర్గంలోని పలు రవాణా అంశాలపై మంత్రికి విన్నవించానని అన్నారు. పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టకు ప్రతి సోమవారం భక్తులు రద్దీ ఎక్కువగా ఉండటం వలన భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నదని, ఆలయ కమిటీ సభ్యులు కలిసినట్టు, దానిలో భాగంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లగా మంత్రి త్వరలో బస్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పట్టణంలోని బస్ డిపోలో బస్‌ల కొరత ఉందని, కొత్త బస్‌లను సంక్షన్ చేయాలని కోరారు. త్వరలో కొత్త బస్‌లను సంక్షన్ చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

పోడు భూముల రైతులకు పట్టాలివ్వాలి

- పోడు భూముల సాధన కమిటీ డిమాండ్


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న పోడు భూముల సాధన కమిటీ సభ్యులు

నవతెలంగాణ-వర్ని(చందూర్)

చందూర్ మండల కేంద్రంతోపాటు, మండలంలోని గ్రామాల్లో ఎస్సీ, బీసీ, మైనారిటీ, ఓసి సామాజిక తరగతుల నిరుపేదలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని "పోడు భూముల సాధన కమిటీ" ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ శాంత కుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోడు భూముల సాధన కమిటీ కన్వీనర్ నన్నేసాబ్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులకు పట్టాలిచ్చి, ఎస్సీ, బీసీ, మైనార్టీ, ఓసిలకు తర్వాత ఇస్తామని దాటవేసిందన్నారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే పోడు రైతులందరికీ పట్టాలిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోడు రైతులు సాయిబాబా, వెంకన్న, సాయిలు, హన్మడ్లు, ఎల్లప్ప, శ్రీను, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో గురు పూజోత్సవం

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని రామాలయంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. గురువు పట్ల శిష్యులు ఏవిధంగా ఉండాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవ ప్రముఖ రాజేంద్రప్రసాద్, జిల్లా గోసేవ ప్రముఖ పాండురంగారావు, హన్మగౌడ్, నరేష్‌గౌడ్, అనిల్, అనిల్ సూర్‌నీడ, రవి గౌడ్, కాచర్ల రాము, రాచర్ల ప్రసాద్, సాయిలు, లక్ష్మీనారాయణ వీరమల్ల, చరణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వీడియోకాన్ఫరెన్స్ ట్రయల్ రన్

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతన వీడియో కాన్ఫరెన్స్ ట్రయల్ రన్‌ను మండల వ్యవసాయాధికారి పద్మ, విస్తరణ అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం రైతులకు పలు సూచనలను ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని, రైతులు సమస్యలను వెంటవెంటనే పరిష్కరిస్తారని తెలిపారు. దాని కోసం నూతనంగా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విస్తరణాధికారి రంజిత్ ఉన్నారు.

జిజిహెచ్‌ను సందర్శించిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్


ఆస్పత్రిలోని వసతులను పరిశీలిస్తున్న కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి కర్ణన్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలోని పలు వార్డులను సందర్శించి తగిన సూచనలను అందజేశారు. ఆసుపత్రికి కావలసిన అవసరాల గురించి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్ కమిషనర్ ఆర్.వీ. కర్ణన్ దృష్టికి తీసుకెళ్లారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

బాలికల కోసం ప్రత్యేక మార్షల్ ఆర్ట్స్ శిక్షణ


శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ధర్పల్లి
మండల కేంద్రంలో మోడల్ పాఠశాలల్లో బాలికల కోసం ప్రత్యేకంగా మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శనివారం ప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ రాజేంద్ర సాహు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం శ్రీ పథకంలో భాగంగా ఆదర్శ పాఠశాల ఎంపికైనటుట హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థినిలకు ఆత్మరక్షణ, నైపుణ్యం పెంపొందించేందుకు మార్షల్ ఆర్ట్స్ నేర్పించనున్నట్టు వివరించారు. ఇందుకొరకు ప్రత్యేకంగా మార్షల్ ఆర్ట్స్ నేర్పించేందుకు మాస్టర్ వినోద్ నాయక్‌ను వారంలో రెండు రోజులు పాఠశాలలో తైక్వాండో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పలు హోటళ్లలో తనిఖీలు

- నిఖిల్‌సాయి ఇంటర్నేషనల్ హోటల్‌కు రూ.15వేల జరిమానా
- కాలం చెల్లిన ఆహార పదార్థాలను గుర్తించి
బిర్యానీ దర్బార్ హోటల్‌కు రూ.10వేలు జరిమానా

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పలు హోటళ్లలో శనివారం తనిఖీలు చేశారు. నిఖిల్ సాయి ఇంటర్నేషనల్ హోటల్‌లో ఒకరోజు ముందు సంబంధించిన మాంసంతో కస్టమర్లకు వండి విక్రయిస్తున్నారు. ఈ విషయం మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల తనిఖీ లలో బయటపడ్డాయి. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్, రెవెన్యూ ఆఫీసర్ నరేందర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర ఆధ్వర్యంలో నగరంలో ప్రాపర్టీ టాక్స్, ట్రేడ్ లైసెన్స్‌లు, పరిసరాల పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా నగరంలోని నిఖిల్ సాయి ఇంటర్నేషనల్ హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం పశువధశాలకు సెలవు, కానీ త్రీ స్టార్ హోటల్‌లో శుక్రవారం స్లాటర్ హౌస్‌లో వధించిన మేకల మాంసాన్ని ఫ్రిడ్జ్‌లో నిలవ ఉంచి శనివారం వాటితో మాంసం పదార్థాలను వండి హోటల్‌కు వచ్చే కస్టమర్లకు వడ్డిస్తున్నారని గుర్తించారు. ఈ మేరకు నిఖిల్ సాయి ఇంటర్నేషనల్ హోటల్‌కు రూ.15వేల జరిమానా విధించారు. అదేవిధంగా బిర్యానీ దర్బార్ హోటల్‌లో కాలం చెల్లిన ఆహార పదార్థాలను గుర్తించి ఆ హోటల్‌కు పదివేల జరిమానా విధించారు. అదేవిధంగా హాట్ చిప్స్ అమ్మే దుకాణంలో ప్లాస్టిక్ కవర్లను గుర్తించి మూడు వేల రూపాయల జరిమానా విధించారు.

మధ్యాహ్న భోజనంలో పురుగులు

- ఆందోళన చేపట్టిన విద్యార్థులు


ఆందోళన చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-సదాశివనగర్
మండలంలోని ఉత్నూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నా యని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. . ఈ విషయం తెలిసిన గ్రామ ప్రజలు పాఠశాల కు విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ భోజనంలో పురుగులు, నాణ్యత లేని కూరలు ,గుడ్డు లేదు ,రెండవ సారి అన్నంకు పోతే అన్నం అడుగుతే బూతులు తిడుతున్నారని విద్యార్థులు వాపోయారు. గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేశాం

నవతెలంగాణ-దోమకొండ
బీబీపేట్ మండల తాజా మాజీ వైస్ ఎంపీపీ కప్పెర రవీందర్ రెడ్డి పదవి విరమణ సందర్భంగా జనగామ గ్రామ నాయకులు, యూత్ నాయకుల ఆధ్వర్యంలో శనివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీబీపేట్ మండల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేశానని, రాజకీయ నాయకులు పదవులతో సంబంధం లేకుండా ప్రజల సమస్యలు పరిష్కారం కోసం ఎల్లప్పుడూ ప్రజాక్షేత్రంలో ఉండాలని అలాంటి వ్యక్తులను ప్రజలు అందరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మట్ట శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలి


కుక్కకు టీకాను వేస్తున్న ఏడీ శ్రీనివాస్

నవతెలంగాణ-దోమకొండ
దోమకొండ మండల కేంద్రం లోని పశు వైద్య శాలలో ఏడి శ్రీనివాస్, వైద్యుల ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా గ్రామలలో ని పెంపుడు కుక్కలకు శనివారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కల నుండి మనుషలకు వ్యాధులు సోకాకుండ వైరస్ నివారణకు కుక్కలకు టీకాలు వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివ కుమార్, సిబ్బంది ఉన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
బీజేపీ ఆధ్వర్యంలో శ్రీనగర్ కాలనీలోని 45వ డివిజన్‌లోని బూత్ నంబర్ 53లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా "ఏక్ పేడ్ మా కే నామ్" అనే కార్యక్రమాన్ని డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 123వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని పోలింగ్ బూతుల పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని తీసుకుందని తెలిపారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో 5లక్షల మొక్కలు నాటనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్, బిజెపి నాయకులు శ్రీనివాస్ శర్మ, ఎండల సుధాకర్, పటేల్ ప్రసాద్ నారాయణ యాదవ్, కోడూరు నాగరాజ్, ప్రతాప్, ఆకుల శ్రీనివాస్, రాహుల్, నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాస్‌లైన్ నేతల అరెస్ట్‌లను ఖండించండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ఇజ్రాయిల్ పాలస్తీనాపై పాశవిక దాడులకు నిరసన తెలుపుతున్న మాస్ లైన్ రాష్ట్ర నాయకుల అక్రమ అరెస్టులను ఖండించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు తెలిపారు. పాలస్థీనాపై ఇజ్రాయిల్ పాశవిక దాడులకు నిరసనగా శనివారం సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు గాజాలో పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడి జాతి నిర్మూలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలో భాగంగా హైదరాబాదులో రాజ్‌భవన్ వద్ద నిరసన తెలియజేయటానికి వెళ్లిన సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెచ్చుల రంగయ్య, గోకినేపల్లి వెంకటేశ్వరరావును అక్రమంగా నిర్బంధించి నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో అంతేకాక ఖైరతాబాద్ రైల్వే స్టేషన్ నుండి రాజమౌన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మాస్ లైన్ రాష్ట్ర నాయకులను కామ్రేడ్ గుమ్మడి నరసయ్య, మాజీ శాసనసభ్యులు రాయల చంద్రశేఖర్, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఐఎఫ్టియు నాయకులు సూర్యం, అన్వేష్, అశోక్, ఎస్ఎల్ పద్మ, తదితరులను అరెస్టు చేయడం సిగ్గుచేటని అన్నారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అవినీతి, వేధింపులపై విద్యుత్ డివిజనల్ ఇంజనీర్‌పై విచారణ

నవతెలంగాణ-ఆర్మూర్
విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ (డిఈ) హరిచంద్ నాయక్‌పై వచ్చిన అవినీతి, వేధింపుల ఫిర్యాదుపై యాంటీ పవర్ థెఫ్ట్ స్క్వాడ్ (ఏపీటీఎస్) అధికారులు శనివారం విచారణ జరిపారు. విద్యుత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ఏపీటీఎస్ అధికారులు పిలిచి విచారణ చేశారు. కార్యాలయంలోని ఒక ఉద్యోగిని సహాయకునిగా నియమించుకొని ఆయన ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నట్లు వరంగల్‌లోని సీఎండికి ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. ఈ ఉద్యోగి ఖాతాలో డబ్బులు వేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఫిర్యాదులు రావడంతో సీఎండీ ఆదేశాల మేరకు ఏపీటీఎస్ అధికారులు రెండు రోజులుగా విద్యుత్ ఉద్యోగులను విచారిస్తున్నారు. ఏపీటీఎస్ అధికారులు డిఈపై వచ్చిన అవినీతి, వేధింపులపై విచారణ జరుపుతున్నామన్నారు. విచారణ పూర్తయిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని చెప్పారు.

ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో రేబిస్ టీకాలు


కుక్కకు టీకాను వేస్తున్న వెటర్నరీ వైద్యుడు

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో శనివారం ఉచితంగా రేబిస్ టీకాల కార్యక్రమం నిర్వహించినట్టు వెటర్నరీ వైద్యులు జియాయుద్దీన్ శనివారం తెలిపారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంట్లో పెంచుకునే పెంపుడు కుక్కలు, ఊర కుక్కలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయాలని, కుక్క కాటు వేసినప్పుడు నాటు వైద్యులని సంప్రదించకుండా, ప్రభుత్వ వైద్యశాలల్లోనే టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైకి సన్మానం


ఎస్ఐని సన్మానిస్తున్న హ్యూమన్‌రైట్స్ ప్రతినిధులు

నవతెలంగాణ-బాల్కొండ
ఇటీవల బాల్కొండ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన మొహమ్మద్ యాసీర్ అరాఫత్‌ను నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫర్ మూమెంట్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కే.అనీఫ్, ఉపాధ్యక్షులు యూత్ ప్రెసిడెంట్ జనరల్ సెక్రెటరీ సురేష్, నిశాంత్‌కుమార్, పటాన్ సల్మాన్‌ఖాన్ మర్యాదపూర్వకంగా కలిసి శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, సాంఘిక కార్యక్రమాలు జూదం, అక్రమ మద్యం, గుట్కా తదితర వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని హ్యూమన్ రైట్స్ సభ్యులు కోరారు.

నిరుద్యోగులు, విద్యార్థి సంఘ నాయకుల

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

- బీఆర్ఎస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల
నిరుద్యోగులు, విద్యార్థి సంఘ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. మండలంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల నాయకులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, వారి డిమాండ్ల సాధనకోసం టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన తెలపడానికి వెళ్తున్న నిరుద్యోగులను, విద్యార్థి సంఘాల నాయకులను అక్రమ అరెస్టులు చేయడాన్ని బీఆర్ఎస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని మండల నాయకులు అన్నారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం, తాజా మాజీ ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జక్కని మధు సూధన్, మండల ప్రధాన కార్యదర్శి బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఏర్గట్ల పీఏసీఎస్ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య, మండల నాయకులు, పాల్గొన్నారు.

డా.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి

నవతెలంగాణ-పోతంగల్
మండల కేంద్రంలో డా.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మొక్కలను పంపిణి చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన మండల నాయకులు

నవతెలంగాణ-పొతంగల్
బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని శనివారం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తాము ఎప్పటికీ తనవేంటే ఉంటామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీనియర్ నాయకులు శంకర్ పటేల్, మాజీ సర్పంచులు ఎస్.రమేష్ ఉన్నారు.

కాంగ్రెస్ డిక్లరేషన్లు అన్ని ఉత్తమాటలేనా..?

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
కాంగ్రెస్ డిక్లరేషన్లు అన్ని ఉత్తమాటలేనా అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రశ్నించారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హైదరాబాద్ యూత్ డిక్లరేషన్లో తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో ప్రాణాలర్పించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, తల్లి, తండ్రి, భార్యకు రూ.2500 గౌరవ పెన్షన్ ఇస్తానని హామీనిచ్చి ఇప్పటివరకు దాని ఊసే లేదన్నారు. ప్రతి ఏడాది జూన్ 2నాటికీ అన్ని శాఖల్లో జాబ్ క్యాలెండర్ ప్రకటించి సెప్టెంబర్ 17లోపు నియామకాలు చేపడతమని హామీ ఇచ్చి ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని సెప్టెంబర్‌లోపు నియామకాలు ఎలా చేపడతారని ప్రశ్నించారు.

మొదటి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు అని చెప్పి, మేఘ డిఎస్సి అని చెప్పి 7నెలలు గడుస్తున్న నియామకాలు పూర్తిస్థాయిలో జరగడం లేదని.. వెంటనే మేగా డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మినారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు, కార్పొరేటర్స్ ఎరం సుధీర్, మాస్టర్ శంకర్, అసెంబ్లీ కో కన్వీనర్ నారాయణ యాదవ్, బీజేపీ ఆఫీస్ సెక్రటరీ బద్దం కిషన్, మండల అధ్యక్షులు గడ్డం రాజు, పుట్ట వీరేందర్, బీజేపీ నాయకులు, ప్రభాకర్, ఆనంద్, పవన్, కార్తీక్, ఖైజార్, అంబదాస్, హరీష్, భూమేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయాధికారుల నియామకం కోసం వినతి


స్వాగతం పలుకుతున్న బార్‌అసోసియేషన్ ప్రతినిధులు

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో ఖాళీగా ఉన్న న్యాయాధికారుల పదవులను భర్తీ చేయాలని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్‌గౌడ్, బార్ ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్, కార్యదర్శి సురేశ్, కోశాధికారి దీపక్‌లతో కలిసి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి పి.శ్రీసుధకు వినతిపత్రం అందజేశారు. శనివారం అధికారిక పర్యటన నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో బస చేసిన ఆమెకు తెలంగాణ రాష్ట్రం న్యాయమూర్తి రాష్ట్ర న్యాయ సేవా సంస్థ చైర్మన్ జస్టిస్ సుజోయ్ పాల్‌లను పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో స్వాగతం పలికి, అనంతరం బార్ తరఫున వినతిపత్రం సమర్పిస్తు పలు సమస్యల పరిష్కరించాలని కోరారు. మహిళలపై జరిగిన అత్యాచారాల కేసులను విచారించే న్యాయస్థానం, అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ప్రత్యేక ఫోక్సో కోర్టు, 5వ అదనపు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులలో న్యాయాధికారులను నియమించాలని జగన్ విన్నవించారు. కోర్టుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ప్రతినిత్యం వందలాది మంది కక్షిదారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మూలంగా వచ్చే వాహనాలు ప్రస్తుత జిల్లాకోర్టు ఆవరణ సరిపోక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొవడం జరుగుతున్నదని జగన్ తెలిపారు. జిల్లా కోర్టు అవసరాలరీత్యా ఓల్డ్ విద్యాశాఖ కార్యాలయ స్థలాన్ని న్యాయశాఖకు కేటాయించే విధంగా కృషి చేయాలని కోరారు. వినతిపత్రాన్ని పరిశీలించిన జస్టిస్ శ్రీసుధ సానుకూలంగా స్పందించారు.

నిజామాబాద్ అదనపు జిల్లా జడ్జిగా, జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించానని జిల్లాకోర్టులో ఉన్న సాదకˆభాదలు తెలుసని జస్టిస్ శ్రీసుధ తెలియజేస్తూ ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా ప్రయత్నిస్తానని ఆమె బార్ ప్రతినిధి వర్గానికి హామీనిచ్చారు. ప్రతినిధి బృందంలో న్యాయవాదులు గోవర్ధన్, పడిగెల వెంకటేశ్వర్, మానిక్‌రాజ్, కవితరెడ్డి, అరేటి నారాయణ, జిల్లా ప్రధాన న్యాయూర్తి సునీతా కుంచాల, రాష్ట్ర న్యాయ సేవా సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరీ, జిల్లా న్యాయమూర్తులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీకి వత్తాసు పలుకుతున్న మోడీ ప్రభుత్వం

- విద్యార్థులకు న్యాయం చేయకపోతే పార్లమెంట్‌ను ముట్టడిస్తాం
- పీడీఎస్‌యూ


మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు అనిల్

నవతెలంగాణ-సిరికొండ
పేపర్ లీకేజీ మాఫియా దోపిడికీ మోడీ ప్రభుత్వం వత్తాసు పలుకుతుందని పిడిఎస్‌యు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్‌యు) కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వమించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ మాట్లాడుతూ.. దేశంలోని పేదవర్గాలను ఉన్నత వైద్య, విద్యకు దూరం చేసే కుట్రలో భాగంగానే నీట్, యూజీసీ నెట్ పేపర్ల లీకేజీలు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీల వలన పేద విద్యార్థులు నష్టపోతున్నా.. మోడీ ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా దేశంలో పేపర్ లీకేజీ ఘటనలకు మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని, నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిచే విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని తెలిపారు. పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీక్ అయిన ప్రాంతాలను, సెంటర్లను గుర్తించి మళ్లీ పరీక్షలు నిర్వహించాలని, పేపర్ లీకేజీలతో నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్.టి.ఏ)ని రద్దు చేసి, నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని, అవసరమైతే విద్యార్థి, యువజన సంఘాలతో కలిసి దేశ పార్లమెంటును ముట్టడిస్తామని మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు భీంగల్ ఏరియా కన్వీనర్ ఆశిష్, అధ్యక్షత వహించగా సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) డివిజన్ నాయకులు దామోదర్, సాయరెడ్డి, మండల నాయకులు కిషోర్, విద్యార్థులు రాజేష్, రవీందర్, సాయిచంద్, సుశీల్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహకార దినోత్సవం


ఎడపల్లిలో జెండా ఎగురవేత

నవతెలంగాణ-ధర్పల్లి/ఎడపల్లి/మద్నూర్
అంతర్జాతీయ సహకార సంఘం దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని ధర్పల్లి, హొన్నజీపేట్, రామడుగు గ్రామాల్లోని సంఘాల చైర్మెన్లు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్పల్లి చైర్మెన్ మాట్లాడుతూ.. నేడు అంతర్జాతీయ సహకార సంఘం దినోత్సవం సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశానుసారం తమ డైరెక్టర్లతో కలిసి జెండాను ఆవిష్కరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు గున్నయ్య, ఆర్మూర్ చిన్న బాలరాజ్, హన్మంత్‌రెడ్డి, సాలేహ బేగం, ప్రేమల, పోత రాజు, శ్రీనివాస్ నాయక్, నర్సాగౌడ్, గంగాబాపు, రంజిత్, నౌసి, రఘు, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏడు రంగుల సహకార పథకాన్ని ఆయన ఎగురవేశారు. కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి రాజారామ్, సహకార సంఘం సిబ్బంది, ప్రభాకర్‌గౌడ్, శ్రీనివాస్, జగన్, రావి చెట్టుకింద సురేష్, రైతులు పాల్గొన్నారు.

మద్నూర్ : సింగిల్ విండో వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ ఉత్సవాలను గనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ ఏడు రంగుల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం సింగిల్ విండో కార్యాలయంలో అంతర్జాతీయ ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి సింగిల్ విండో వైస్ చైర్మన్ శంకర్రావు, సంఘం కార్యవర్గ సభ్యులు సింగిల్ విండో కార్యదర్శి బాబురావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.